# ఈ ప్రశ్నకు బదులేది

(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక 8-10-1998)

---

గత దశాబ్దకాలంగా అతన్ని గమనిస్తూనే వున్నాన్నేను. మతి స్థిమితం లేని మనిషి. అయినా మర్యాదగానే వ్యవహరిస్తాడు. తనలో తనే మాట్లాడుకోవడం, పోట్లాడుకోవటం, పెద్దపెద్దగా నవ్వుకోవడం ... ఇవి అతన్ని మతి స్థిమితం లేని మనిషిగా గుర్తించడానికి ముఖ్యమైన ఉదాహరణలు.

ముతకవే అయినా మురికిగా మాత్రం వుండవ్ అతను వేసుకునే బట్టలు. వారానికి ఒక్కసారయినా గెడ్డం చేసుకుంటుంటాడు. చూసేందుకు వికారంగా గానీ, భయానకంగా గానీ వుండడు.

హోటళ్ళ ముందు నిలబడి వచ్చేపోయే వాళ్ల ముందు చిరునవ్వుతో చేయి చాస్తాడు. రోడ్ల వెంట చెప్పులు లేకుండా తిరుగుతుంటాడు. రాత్రిపూట అతని మకాం ఎక్కడో, ఎండకీ, వానకి ఎక్కడ తలదాచుకుంటాడో తెలీదు నాకు.

అతగాడి యాచనలో దేబిరింపూ వుండదు, బెదిరింపూ వుండదు. అతని ముఖంలో నేను ఎప్పుడూ విచారంగానీ, సంతోషపు మెరుపుగానీ చూడలేదు. ఎప్పుడు చూసినా ఉదాసీనంగా, నిర్లిప్తంగా కనిపిస్తాడు.

ఇటీవలే అతగాడి పేరు బిక్షపతి అని మాత్రం తెలిపింది. డిగ్రీ పూర్తి చేయటంతో కావలసినంత తీరిక దొరికినట్లయ్యింది నాకు. అవకాశం చూసుకుని బిక్షపతితో మాట్లాడాలని కోరిక కలిగింది నాలో. అతడు పిచ్చివాడనే విషయం నిజమా కాదా అన్న సందేహం పట్టుకున్నది నాకు.

ఈమధ్య అతని ప్రవరనలో కొంతమార్పు కన్పించసాగింది. పిల్లల్ని భయపెట్టటం, రాళ్లు విసిరివేయడం, పెద్దపెద్దగా అరుచుకుంటూ, గాల్లో చేతులు వూపుకుంటూ నడవడం లాంటి చేష్టల్తో కన్పించాడు నాలుగయిదుసార్లు.

ఓ రోజు మెడలో పూలమాల వేసుకుని ఎడమచేతి పిడికిల్ని మైకులా నోటి ముందుంచుకుని ఏమిటేమిటో మాట్లాడుకుంటూ నడిచి వెళ్ళటం చూశాను. అతని మాటలు అస్పష్టంగా వినిపించినై, అర్థ రహితంగా వున్నయ్.

క్రితం రోజే మా ఏరియాలో ఓ రాజకీయ పార్టీ వారి బహిరంగ సభ జరిగింది. వూరువూరంతా పూలతోరణాలతో నిండిపోయింది వీధులన్నీ విరితోటలైపోయినై. "బహుశా బిక్షపతి ఓ దండ అక్కడ సంపాయించి వేసుకుని వుంటాడు. నిన్నటి రాజకీయ ఉపన్యాసం అతని ఈనాటి వేషధారణకు ప్రేరణ అయివుంటుంది" అనుకున్నాను

మరో రెండ్రోజులవరకూ అతడు ఆ వాడిన పూలదండ మెడలో ఉంచుకునే తిరిగేడు.

పది సంవత్సరాలుగా పట్టించుకోని బిక్షపతిని గురించిన వివరాలు తెలుసుకోవాలన్న ఉబలాటం రోజు రోజుకు ఎక్కువ కాసాగింది నాలో. కొంత సమయం అందుకు కేటాయిస్తేనేగాని వివరాలు తెలుసుకోలేననుకున్నాను. వీలయినంత త్వరలో బిక్షపతి చరిత్రేమిటో తెలుసుకోవాలని స్థిర నిర్ణయానికి వచ్చేశాను.

బిక్షపతి అసలు వూరు ఏదో తెలియిలేదు. అతనివాళ్లంటూ ఎవరూ మావూళ్ళో లేరని తెలిసింది. రాత్రిళ్లు శివాలయంలో పడుకుంటుంటాడట స్నానాది కార్యక్రమాలన్నీ అక్కడే పూర్తి చేసుకుంటాడట పూజారి అప్పుడప్పుడు అందించే ప్రసాదాలు, గుడికి

వచ్చే భక్తులు ఇచ్చే అరటిపండ్లు, కొబ్బరి ముక్కలు అర గిస్తుంటాడట.

ప్రతిరోజూ, రెండు పూటలా ఆలయ ప్రాంగణమంతా చిమ్మి శుభ్రం చేస్తుంటాడట. ఎవర్తో మాట్లాడడట. ఎవరైనా ఏమైనా అడిగితే చిరునవ్వే బదులిచ్చి వెళ్ళిపోతాడట. ఈ మాత్రం విషయ సేకరణ చేయగలిగేను బిక్షపతిని కలుసుకోకముందే.

"ఇంత ప్రయత్నిస్తూ చేస్తే, నేనేం అడిగినా అతగాడు సమాధానం చెప్పడేమో" అనే సందేహం కలిగింది నాకు. అయినా సరే నా ప్రయత్నం నేను చేయదలుచుకున్నాను.

ఓ రోజు వీధి వాకిట్లో నిల్చున్నాను. కాసేపటికి బిక్షపతి దూరంనుంచి కన్పించాడు మా ఇంటి ముందుకు రాగానే చప్పట్లు కొట్టాను అతను విస్మయంగా నా వంక చూశాడు. రమ్మని చేతు లూపేను.

ఓ పిచ్చి నవ్వు నవ్వి అతడూ చప్పట్లు కొట్టాడు. నన్నే రమ్మని నేనూపినట్లే చేయి వూపి కొంచెం దూరం పరుగుతీశాడు. నేను కోరుకున్నట్లు అతన్తో మాట్లాడటం అంత సులభం కాదేమో అనిపించింది.

ఓ వారం రోజులలా ఏవేవో వ్యాపకాల్తో గడిచిపోయినై. బిక్షపతి ధోరణిలో ఓ విచిత్రమైన మార్పు కన్పించసాగింది.

"అయామె లేకియర్.... నేను లక్షాధికార్ని. లక్షా ఇరవై వేల నగదు నా దగ్గరున్నట్టే .. హ .... హ్హా...." అనుకుంటూ తిరుగుతున్నాడు ఈ పరిణామం ఏమిటో ఎంతకీ అంతు చిక్కలేదు నాకు.

"పిచ్చివాడి మాటలకి ఇంతగా ఆలోచించటం అనవసరం" అన్పించింది.

ఓ రోజు ఉదయాన్నే హోటల్‌కి వెళ్ళాను.

హొటల్ గేటు దగ్గరే బిక్షపతి కన్పించాడు. నాతోపాటు లోపలికి రమ్మని సైగ చేశాను మౌనంగా నన్ననుసరించాడతడు.

టిఫిన్ ఆర్డర్ ఇచ్చాను రెండు ప్లేట్లు అటు తర్వాత మరో రెండు రకాలు కూడా తిన్నాడు బిక్షపతి.

"ఇంకేమైనా తిను "

నా మాటలు పూర్తికాకుండానే తల అడ్డంగా వూపేడు.

కాఫీ తెమ్మన్నాను సర్వర్‌తో

అంతవరకూ నేనసలు బిక్షపతితో ఏమీ మాట్లాడలేదు. అతడు నా ఉనికినే మర్చిపోయినట్లు టిఫిన్ తినేశాడు.

కాఫీ తాగుతూ బిక్షపతి ముఖంలోకి నిశితంగా చూశాను. ఆకలి తీరిన తృప్తి కన్పించింది నాకు అతని ముఖంలో.

బిల్ చెల్లించాను.

ఇద్దరం బయటకు నడిచాం.

"అలా వెళ్దాం పద" అన్నాను జన సంచారం అంతగా వుండని ఓ రోడ్డువంక చూపుతూ.

అర్థం కానట్లు నావంక చూశాడు.

పదమన్నట్లు తలాడించాను.

ఏమనుకున్నాడో అటుగా నడిచాడు నాతోపాటు.

"మీదేవూరు" అడిగేను.

మాట్లాడలేదు.

"నీకు ఎవరూ లేరా ?"

"...."

"ఏం మాట్లాడవా ?"

"...."

5153
శ్రీకాకుళం

"ఈ మధ్యేంటి లక్షాధికార్ని, నాకు లక్షా ఇరవై వేలున్నయ్ ... అంటూ తిరుగుతున్నావ్ ఏమిటి విషయం"

"వాటీజ్ యువర్ నేమ్" నా ప్రశ్నకు బదులుగా ప్రశ్నించాడు బిక్షపతి.

'ఈ పిచ్చివాడి బతుక్కి ఇంగ్లీషు కూడానా' అనుకుంటూ నా పేరు చెప్పేను.

"వాటీజ్ యువర్ క్వాలిఫికేషన్" మరో ప్రశ్న

'ఇతగాడు అందరనుకుంటున్నట్లు పిచ్చివాడు కాదు. కాస్తో కూస్తో చదువుకున్నట్లే వున్నాడు' మనసులోనే అనుకుని సమాధానం చెప్పేను.

"నేనడిగిన వాటికి సమాధానం చెప్పకుండా నా వివరాలన్నీ అడుగుతున్నావే" అన్నాను చిరుకోపం ప్రదర్శిస్తూ.

"నువ్వడిగిందానికి సమాధానం చెప్పటానికే సమాచారం సేకరిస్తున్నానూ" అని పెద్దగా నవ్వేడు.

అతని మాటలు నాకు ఆసక్తి కలుగజేసినయ్. బిక్షపతి అడిగిన వాటన్నింటికీ సమాధానాలు చెప్పేందుకు సిద్ధపడ్డాను.

"డు యు నో పాపులేషన్ ఆఫ్ ఇండియా ... భారతదేశ జనాభా ఎంతో తెల్సా నీకు" ఇంగ్లీషు, తెలుగు రెండు భాషల్లోనూ ఒకే ప్రశ్న అడిగేడు ఓ తెలుగు సినిమా నటుడి ఫక్కీలో.

"తొంభై కోట్లనుకో" అన్నాను.

"దెన్ యూ యాడ్ ఆల్ దీస్....

యూరియా కుంభకోణం....కోట్లు

పశుగ్రాసం కుంభకోణం ...కోట్లు

చక్కెర కుంభకోణం....కోట్లు

సిమెంటు కుంభకోణం ....కోట్లు

చింతపండు కుంభకోణం కోట్లు
మిరపకాయలు
అల్లం
బెల్లం

షేర్లు....వగైరా వగైరా కుంభకోణాలన్నింటిని ఏకరువు పెట్టాడు. అంతా కూడి తొంభై కోట్లచేత భాగించమన్నాడు "అప్పుడు నావాటా లక్షా ఇరవై వేలు కాదా" అనడిగి పెద్దగా నవ్వేశాడు

అతని నవ్వు ఆపట నావల్లకాలేదు.

అంతేకాదు బిక్షపతి ప్రశ్నకు నాకేం సమాధానం చెప్పాలో తోచలేదు ఒక్కటి మాత్రం అనిపించింది బిక్షపతి పిచ్చి వాడా ? అని !

— o —